## క్లుప్తంగా

### పాండురంగ కుటుంబానికి ముద్రగడ పరామర్శ



పాండురంగ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: విశ్రాంతి ఉద్యోగి సూరత్ పాండు రంగ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యుడు (పీఏసీ) ముద్రగడ పద్మనాభం చిల్లంగిలోని పాండురంగ నివాసానికి వెళ్లి అతని కుమారులు శ్రీను, పవన్‌ను పరామర్శించారు. పాండురంగ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

### 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' లను విజయవంతం చేయాలి



ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ఈ 21వ తేదీ లోపు నియోజకవర్గంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, ఏలేశ్వరం రూరల్, శంఖవరం, రౌతులపూడి మండల కేంద్రాల్లో నిర్వహించే బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల అనుబంధ విభాగాల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### భగవద్గీత పారాయణ

ఏలేశ్వరం: సంకటహర చతుర్థి సందర్భంగా పట్టణంలో సోమవారం మహిళలు పారాయణ పఠనం చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ సమీపంలోని వినాయకుని ఆలయం వద్ద మహిళలు సంపత్ గణపతి గానమృతం, హనుమాన్ చాలీసా, భగవద్గీత పారాయణ చేసి భక్తి పాటలు ఆలపించారు. విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరీటి, మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల సభ్యులు గిరిజ, ఇందిరా, మంగామణి, కామాక్షి, హైమావతి, మానస, సూర్యకుమారి, ఉమా, రమదేవి తదితరులు పాల్గొన్నారు.

### 200 మందికి కంటి పరీక్షలు



కొత్త యర్రవరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏలేశ్వరం: మండలంలోని కొత్త యర్రవరంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో నిడదవోలుకు చెందిన రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు సుమారు 200 మందికి కంటి పరీక్షలు చేశారు. 20 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం ఆసుపత్రి తరలించారు. ప్రజలకు కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

### ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బస్సు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొట్టింది. ఆ సమయంలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే...గోకవరం ఆర్టీసీ డిపోకు చెందిన ప్రైవేటు బస్సు కాకినాడ నుంచి ఆదివారం రాత్రి గోకవరం వస్తుండగా కొత్తపల్లి శివారున ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడగా బస్సులో ప్రయాణికులు పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న గోకవరం పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. దీనిపై గోకవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

### పునరావాస కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడిలో పుష్కర పునరావాస కాలనీవాసుల సమస్యలు పాలకులకు పట్టడం లేదని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన పుష్కర కాలనీవాసులతో కలిసి కిర్లంపూడి తహసీల్దార్‌ను కలిసి సమస్యలు వివరించారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ సమర్పించారు.

# చినుకు పడదు.. సాగు సాగదు

- వేసవిని తలపిస్తున్న ఎండలు
- ఎండిపోతున్న నారుమడులు
- ముందుకు సాగని ఖరీఫ్ పనులు
- వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు



ఎస్.అన్నవరం శివారులో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న నారుమడులు

తుని రూరల్: ఎండలు మండిపోతున్నాయి. వర్షాకాలంలోనూ వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. చినుకు పడకపోవడంతో ఖరీఫ్ పనులు ముందుకు సాగడం లేదు. ఖరీఫ్ సీజన్ మొదలై ఆరు వారాలైనా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవ లేదు. ఈ నెల మొదట వారంలో కురిసిన వర్షాలకు కొంత మంది రైతులు విత్తనాలు వేసినా ఆ తర్వాత నీటి తడులు అందలేదు. విత్తనాల మొలకశాతం తగ్గిపోవడమే కాకుండా నారుమళ్లు ఎండిపోతున్నాయి.

**నియోజకవర్గంలో..**

తుని నియోజకవర్గంలో భూములకు సరైన సాగు నీటి వసతులు లేకపోవడంతో అధికశాతం వర్షాధారంపై రైతులు ఆధారపడుతున్నారు. వర్షాల్లేకపోవడంతో సాగునీటి చెరువులు నిండుకుని వెలవెలబోతున్నాయి. పంపా, తాండవ రిజర్వాయర్లు, పుష్కర, పీబీసీ కాలువ ఉన్నా శివారు కావడంతో నీరు ఎప్పుడు చేరుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. వర్షపాతం సైతం తుని మండలంలో అత్యల్పంగా, కోటనందూరు, తొండంగి మండలాల్లో స్వల్పంగా ఎక్కువ ఉంది. ఇలాగే ఉష్ణోగ్రతలు కొనసాగితే ఖరీఫ్‌లో సాంప్రదాయ వరిసాగు విస్తీర్ణం ఈ సంవత్సరం ఘననీయంగా తగ్గిపోనుంది. మరోపక్క ఖరీఫ్ కాలంలో ఆరువారాలు గడిచిపోవడంతో కాలానికి అనుగుణంగా ఆరుతడిగా అపరాలు, చిరుధాన్యాలు, వెదజల్లు సాగు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకు అవసరమైన విత్తనాల కిట్లు ఎంపిక చేసిన రైతులకు అందిస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు.

**నియోజకవర్గంలో 11947 హెక్టార్లలో సాగు**

నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఖరీఫ్ సాధారణ వరిసాగు విస్తీర్ణం 11947 హెక్టార్లు. ఇందులో అత్యధికంగా తొండంగి మండలంలో 5193 హెక్టార్లు, కోటనందూరులో 4023 హెక్టార్లు, తుని మండలంలో 2731 హెక్టార్ల భూములు ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే అన్నవరంలోని పంపా రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుంది. తొండంగి మండలంలో 5193 హెక్టార్ల భూములకు ప్రధాన నీటి వనరు పంపా రిజర్వాయరే. పంపా నుంచి నీరు విడుదలైతేనే ఆయా భూములకు సాగునీరు చేరుతుంది. పీబీసీ, పుష్కర కాలువల ద్వారా కొంత మేరకు నీరు అందనుంది. కోటనందూరు మండలంలోని 4023 హెక్టార్లలో సాగు జరగాలంటే తాండవ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయాల్సి ఉంది. 380 గరిష్ట నీటిమట్టం గల రిజర్వాయర్‌లో అంతంతమాత్రంగానే నీటి నిల్వలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్వల్పంగా పెరిగి ప్రస్తుతం 368 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. కనీసం 370 అడుగుల నీటి నిల్వలు ఉంటేనే సాగుభూములకు నీరు విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. పంపా, తాండవ రిజర్వాయర్లు, పుష్కర కాలువకు శివారులో తుని మండలంలో 2731 హెక్టార్ల భూములు ఉన్నాయి. మండలంలో 75 సాగునీటి చెరువలు ఉండగా ఐదారు చెరువుల్లోనే నీటి నిల్వలు ఉన్నాయి.



కవలపాడులో తడుల్లేక పూర్తిస్థాయిలో మెలకెత్తని వరి విత్తనాలు



ఎన్.చామవరంలో నాట్లు, నారుమళ్లు లేక నిరుపయోగంగా ఉన్న భూములు

### 103 హెక్టార్లలో నారుమడులు

తుని నియోజకవర్గం మెట్ట ప్రాంతం కావడం, పంపా, తాండవల్లో నీటి కొరత, పుష్కర, పీబీసీ కాలువలు శివారు కావడంతో సాగునీరు లభ్యత కష్టమవుతుంది. ఇప్పటి వరకు 103 హెక్టార్లలో వరి విత్తనాలతో రైతులు నారుమడులు వేశారు. 295 హెక్టార్లలో పత్తి సాగువుతోంది. భూములను బీడుగా వదిలేయకుండా వెదజల్లు పద్ధతిలో వరి, ఆరుతడిగా అపరాలు, చిరుధాన్యాలు వేస్తే ఖరీఫ్ పంటకాలం కలిసి వస్తుంది. ఎంపిక చేసిన రైతులకు 518 మినుము, కంది, రాగుల విత్తన కిట్లను ఉచితంగా అందిస్తున్నాం.1985 మంది సాగుదారులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశాం.

– జి.వి.పద్మశ్రీ, ఏడీఏ, తుని

### భూములకు పాస్‌బుక్‌లు ఇవ్వాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న దళిత మహిళలు

ఏలేశ్వరం: తాము సాగు చేసుకుంటున్న భూములకు పాస్‌బుక్‌లు ఇవ్వాలని కోరుతూ పట్టణంలో సోమవారం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన దళిత మహిళలు ధర్నా చేశారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ తూర్పులక్ష్మీపురంలో 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 40 ఎకరాల భూమి కొనుగోలు చేసి 56 మంది దళిత మహిళలకు పంపిణీ చేసిందన్నారు. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్న భూములకు ఇప్పటి వరకు పాస్‌బుక్‌లు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సాగు భూములకు పాస్‌బుక్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సగరపు సుబ్బయ్య, బత్తిన మేరీ, ధారా మేరీ, తురాల అప్పలరాజు, గారా సత్యవతి, రాయి పాప తదితరులు పాల్గొన్నారు.

### జూదం ఆడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు గ్రామ శివారులో జూదం శిబిరంపై జగ్గంపేట ఎస్సై రఘునాథరావు సోమవారం దాడి చేశారు. ఈ దాడుల్లో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.11,300 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

## ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలి

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం
- జగ్గంపేటలో పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం పిలుపునిచ్చారు. జగ్గంపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా అధ్యక్షతన మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కింద రూ.8 వేల కోట్లు ఖర్చు చేస్తే, కరెంట్ బిల్లుల పెంపు ద్వారా రూ.16 వేల కోట్లు లాగేసిందన్నారు. కరెంట్ బిల్లులు గతానికి ఇప్పటికీ ఎంత దారుణంగా పెరిగాయో ప్రజలే గమనించుకోవాలన్నారు. 15 ఏళ్లు దాటిన ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా ఇప్పటికీ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. తొలి అడుగు పేరుతో మీ గ్రామాలకు వస్తున్న కూటమి నేతలను ఈ సొమ్ము గురించి నిలదీయాలని సూచించారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాంజీ మాట్లాడుతూ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందన్నారు. మన నాయకుడు జగన్‌పై అభిమానం రెట్టింపు అవుతోందన్నారు. జగన్ రోడ్డు మీదకు వస్తే జనం లక్షలాదిగా తరలివస్తున్నారని, ఇది చూసి కూటమి నేతలకు నిద్రపట్టడం లేదన్నారు. స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు ఒమ్మి రఘురాం మాట్లాడుతూ కూటమి ఎన్ని తప్పులు చేసినా ఎల్లో మీడియా వాటిని ప్రజలకు చూపించడం లేదన్నారు. మనకు ఉన్న ఏకైక మీడియా సాక్షి అని, గ్రామాల్లో సాక్షి చానల్, సాక్షి పత్రిక అందరికీ అందుబాటులో ఉండేలా పార్టీ నేతలు కృషి చేయాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ వినియోగంపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు రామకుర్తి జగాల్, కరుటూరి శ్రీనివాస్, పాలిపిరెడ్డి సత్యనారాయణ, తులా రాము, కరుటూరి వీర్రాజు, కాపారపు రమణ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

## గోల్డ్ బాధితుల ఆందోళన



తేటగుంట కెనరా బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న గోల్డ్ బాధితులు

తుని రూరల్: తాకట్టు పెట్టిన తమ బంగారు ఆభరణాలు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాధితులు తేటగుంట కెనరా బ్యాంకు ఎదుటు ఆందోళన నిర్వహించారు. ఐదు నెలలు కిందట అప్రైజర్ తాకట్టు పెట్టిన ఆభరణాల్లో కొన్నింటిని కాజేశాడు. ఈ ఘటనలో మేనేజర్ సహా ముగ్గురు ఉద్యోగులను ఉన్నత అధికారులు సస్పెండ్ చేశారు. దీంతో నియమితులైన బీఎం యేసుదాసును సంప్రదించగా ఆభరణాలు గోల్‌మాల్ కావడం వాస్తవమేనని, ఆందోళన చెందాల్సిన అవసరం లేని బాధితుల నగలు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు ఐదు నెలలు గడువు కావాలని బాధితులకు రాతపూర్వకంగా తెలిపారు. ఐదు నెలలు గడువు పూర్తవ్వడంతో సోమవారం కొంతమంది బాధితులు బ్యాంకు మేనేజర్‌ను కలసి తమ ఆభరణాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ఇద్దరు బాధితులకు సెటిల్‌మెంట్ చేశామని, మరో 50 మంది బాధితుల సెటిల్‌మెంట్‌కు అవసరమైన రికార్డులను ఉన్నత అధికారులకు పంపించినట్టు వివరించారు. అప్పటిలోగా బాధితులంతా ఐదు నెలల వడ్డీలు చెల్లించాలన్నారు. ఆభరణాలు నష్టపోయిన తాము వడ్డీ చెల్లించడం ఎంటని ప్రశ్నిస్తూ బాధితులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చెన్నకేశవరావు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో చర్చించారు. వడ్డీ చెల్లించకుండా నగలు లేదా నగదు ఇచ్చేందుకు ఉన్నత అధికారులతో బ్రాంచి మేనేజరు సంప్రదిస్తున్నారని, పది రోజుల్లో సమస్యను పరిష్కారమవుతుందని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించారు. గోల్డ్ గోల్‌మాల్‌లో మొత్తంగా 250 మందికి పైగా బాధితులకు చెందిన రూ.కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్టు తెలుస్తుంది.

## సత్రం భూములకు కౌలు వేలం



తొండంగి శివాలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

తొండంగి: పిఠాపురం శ్రీసంస్థాన సత్రానికి చెందిన తొండంగిలోని 511 ఎకరాల భూమికి దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారులు సోమవారం కౌలు వేలం నిర్వహించారు. కుంటుసాకులతో పలుమార్లు వాయిదాలు వేసుకుంటూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు వేలం ప్రక్రియను ప్రారంభించారు. స్థానిక శివాలయంలో దేవదాయ, ధర్మాదాయశాఖ పర్యవేక్షకుడు వీరభద్రరావు, శ్రీసంస్థానం ఈవో సున్న శ్రీరాములు, ఇతర సిబ్బంది వేలం ప్రక్రియను నిర్వహించారు. వినియోగంలో ఉన్న భూములు మొత్తం 478 ఎకరాలకు పలు బిట్లుగా మూడేళ్ల కాలపరిమితికి కౌలువేలం నిర్వహించాల్సి ఉండగా మొదటి రోజు 30 బిట్లుగా ఉన్న 61.90 ఎకరాలకు మూడేళ్ల కాలపరిమితితో వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా రూ.5.94 లక్షల ఆదాయం వచ్చింది. గతంలో కంటే ఇప్పుడు 15 వేలు పైగా ఆదాయం పెరిగిందని ఈవో తెలిపారు. కాగా ఎటువంటి వివాదాలకు తావులేకుండా తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై బి.జగన్మోహన్‌రావు బందోబస్తు ఏర్పాటు చేసి వేలం ప్రక్రియను పర్యవేక్షించారు. మరో నాలుగు రోజుల పాటు కౌలువేలం ప్రక్రియ కొనసాగుతుందని ఈవో శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో శ్రీసంస్థానం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: మండలంలోని పాదురుపాకలో బైక్ బోల్తా పడిన ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు శంఖవరం మండలం పెదమల్లాపురం గ్రామానికి చెందిన ఖండిపల్లి కామరాజు (54) ప్రత్తిపాడు నుంచి స్వగ్రామం వెళ్తుండగా పాదురుపాక గ్రామంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడ్డాడు. తీవ్రంగా గాయపడిన కామరాజును రౌతులపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శవపరీక్ష కోసం మృతదేహాన్ని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**యాచకురాలు మృతి**

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద రెండు వారాల క్రితం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన యాచకురాలి మృతదేహానికి సోమవారం శవపరీక్ష నిర్వహించారు. స్థానిక పోలీసుల కథనం మేరకు మండలంలోని ధర్మవరం పెట్రోల్ బంక్ సమీపంలో రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు 60 ఏళ్ల యాచకురాలు తీవ్రంగా గాయపడింది. ఈమెను చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దాడిశెట్టి రాజా తదితరులు

కోటనందూరు: మండలంలోని బొద్దవరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు ఏడిద రవితో పాటు మరో 10 మంది వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేగి అప్పలనాయుడు, దొడ్డి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## భూములను ఆన్‌లైన్ చేయాలంటూ నిరసన



భూములను ఆన్‌లైన్ చేయాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కాకినాడ సిటీ: ప్రత్తిపాడు మండలం ఉద్దండ జగన్నాథపురంలో ఉన్న సుమారు 80 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయాలంటూ ఆ భూమిని సాగు చేసుకుంటున్న రైతులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ భూమిని 70 మంది రైతులు 60 ఏళ్లుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో ఉండేదని, ఏడాది కిందట రీసర్వేలో ఆన్‌లైన్‌లోని అడంగల్‌లో నమోదు కాలేదని రైతులు అన్నారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా సమస్య పరిష్కారం అవ్వడం లేదన్నారు. ఈ సమస్య జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ పరిధిలో ఉంటుందని, ఆయనే సమస్యను పరిష్కరిస్తారని చెప్పడంతో కలెక్టరేట్‌కు వచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 1బీ అడంగల్‌లో నమోదు కాని కారణంగా తమకు వ్యవసాయం చేసుకునే నిమిత్తం రుణాలను బ్యాంకులు మంజూరు చేయడం లేదని రైతులు వాపోయారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించి అడంగల్ 1బీలో నమోదు చేయించాలని కోరారు. అనంతరం జేసీ రాహుల్ మీనాను కలసి వినతిపత్రం అందజేశారు.

### రామలింగేశ్వరస్వామికి పూజలు

గండేపల్లి: తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంకటహర చతుర్థి సందర్భంగా అర్చకుడు వీఎస్‌ఎస్ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవాలి



ర్యాలీ చేస్తున్న జడ్జి గోపీనాథ్, న్యాయవాదులు

ప్రత్తిపాడు: కక్షిదారులు మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్ కోరారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్తిపాడులో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు వద్ద న్యాయమూర్తి గోపీనాథ్ ర్యాలీని ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం మీదుగా అల్లూరి సీతారామరాజు జంక్షన్ మీదుగా తిరిగి కోర్టుకు ర్యాలీ చేరింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి గోపీనాథ్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవ్వడంతో పాటు సమస్య సత్వరమే పరిష్కారం అవుతుందన్నారు. ఈ నెల 10 నుంచి 16 వరకూ మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగత శివ, ప్యానెల్ అడ్వకేట్లు అవసరాల దేవి, కుసుమించి సూర్యప్రకాశరావు, ఆకాశపు మల్లేశ్వరరావు, బొంగుకూరి మధుబాబు, బార్ ప్రతినిధులు, న్యాయవాదులు కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగుల సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్‌ఆర్‌ఆర్ కృష్ణన్ తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్స్ సీట్లు ఖాళీలు ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రింట్ కాపీ, ఒరిజనల్ సర్టిఫికెట్లను ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94402 62266, 81423 45444 నంబర్లుకు సంప్రదించాలని సూచించారు.

### శృంగవృక్షం హైస్కూల్‌కు చేరిన స్కూల్ బ్యాగ్‌లు

తొండంగి: మండలంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగ్‌లు శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్‌కు చేరినట్టు ఎంఈవో షేక్‌బాబ్జి తెలిపారు. మండలంలోని ప్రైమరీ, యూపీ స్కూళ్ల విద్యార్థులకు బ్యాగులు ఇప్పటికే అందించామన్నారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగులు సెంట్రల్ స్టోర్ నుంచి వచ్చాయన్నారు. మరో రెండు రోజుల్లో అన్ని స్కూళ్లకు బ్యాగులను పంపించి విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ కొల్లు సత్తిబాబు సూచించారు. మండలంలోని కత్తిపూడిలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.